నవంబర్ 6 నుంచి కులగణన సర్వే చేపట్టండి



కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: నవంబర్ 6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటినీ చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుంచి పాల్గొనగా, వీసీలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు కులగణనపై భట్టి దిశా నిర్దేశం

కలెక్టర్లు సమగ్ర కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్స్ మాన్యువల్ అందే విధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యూమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 5-7 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్ఠంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సర్వేను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలన్నారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ , సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హరీష్ పాల్గొన్నారు.

జిల్లాలో 29.40 లక్షల ఓటర్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల సంఘం మంగళవారం ఓటరు జాబితాను విడుదల చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 29,40,923 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 15,13,910 మంది, మహిళా ఓటర్లు 14,26,612 మంది, ట్రాన్ జెండర్ ఓటర్లు 401 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 725 మంది, సర్వీస్ ఓటర్లు 735 మంది ఉన్నారు.

విలీన గ్రామాల్లో చైర్‌పర్సన్ పర్యటన



ఎదులాబాద్‌లో వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎదులాబాద్, మర్పల్లిగూడలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య సోమవారం పర్యటించారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, విధులు హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఏమైన సమస్యలు ఉంటే కౌన్సిల్ సభ్యులకు, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, జంగయ్యయాదవ్, రవి, మున్సిపల్ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదలు చేయాలి



ఘట్‌కేసర్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదని, విద్యార్థులు సర్టిఫికెట్లు అడిగితే ఇవ్వడానికి కళాశాలల యాజమాన్యాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పోలీసు అమరవీరుల వారోత్సవ ర్యాలీ



కార్యక్రమంలో ఏసీపీ చక్రపాణి తదితరులు

పోచారం: పోలీసు అమరవీరుల వారత్సోవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అన్నోజిగూడ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులతో కలిసి స్కూల్ నుంచి అన్నోజిగూడ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐ రాజు, ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, కృష్ణయ్య, శివకృష్ణ, నాగేశ్వరరావు, పోచారం పోలీస్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు దివ్వెల సందడి



అమ్మకానికి ఉంచిన లక్ష్మీదేవి, ఇతర దేవతామూర్తుల ప్రతిమలు

దీపావళి పండగ వేళ కారు చీకట్లు పారదోలే వెలుగు దివ్వెలు చిరు వ్యాపారులకు ఉపాధి కల్పిస్తున్నాయి. రెండు రోజుల్లో పండగ సమీపిస్తుండటంతో మేడ్చల్ మార్కెట్‌ను మట్టి దీపాలు ముంచెత్తాయి. మట్టితో తయారుచేసే అందమైన ప్రమిదలకు మరింత క్రేజ్ పెరిగింది. మైనంతో తయారయ్యే దీపాలు కాకుండా ప్రమిదలను ప్రజలు కోరుకుంటున్నారు. దీంతో మట్టితో పాత్రలు తయారు చేసే కుమ్మరులు, చిరు వ్యాపారులకు దీపావళి సీజన్ కలిసొస్తోంది. కొందరు వ్యాపారులు డిమాండ్‌కు తగ్గట్టుగా ఇతర ప్రాంతాల నుంచి వెరైటీ డిజైన్లలో ఇంపోర్టెడ్ ప్రమిదలను తెచ్చి విక్రయిస్తున్నారు.
మేడ్చల్‌రూరల్

- మట్టితో చేసిన ప్రమిదలకు క్రేజ్
- మార్కెట్‌లో వెరైటీ డిజైన్లలో అమ్మకాలు
- చిరు వ్యాపారులకు ఉపాధి

సీజనల్ ఉపాధి..

కార్తీక మాసంలో హిందువులు ఇంటి ముందు దీపాలు పెట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మైనం దీపాలతో గతంలో ఆదరణ కోల్పోయిన మట్టి ప్రమిదలు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో మళ్లీ వినియోగం పుంచుకుంది. దీంతో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో కుమ్మరులు, చిరు వ్యాపారులు అమ్మకాలు జరుపుతుండగా, మండలంలోని పలు గ్రామాల వారు మేడ్చల్ మార్కెట్‌కు వచ్చి మట్టి పాత్రలు విక్రయిస్తున్నారు. మరికొందరు గ్రామాల్లో, వీధుల్లో తిరిగి విక్రయిస్తున్నారు. దీంతో వీరికి సీజనల్ ఉపాధి దొరికినట్లైంది.

మార్కెట్‌లో సందడి మరూ...

మేడ్చల్ పట్టణంలోని మార్కెట్‌లో, పలు ప్రధాన కూడళ్ల వద్ద వ్యాపారులు అమ్మకాలు సాగిస్తుండడంతో ప్రమిదల కొనుగోళ్ల సందడిగా మారింది. దీపావళి పండగకు రెండు రోజుల ముందుగానే ప్రజలు పూజా సామాగ్రి, ప్రమిదలు, దొంతులు, పూలు, పండ్లు కొనే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు దీపావళి సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికాలు అమ్మే వ్యాపారులు, షాపింగ్ మాల్స్ కస్టమర్లకు భారీ డిస్కౌంట్లు ఇస్తూ ఆకర్షిస్తున్నాయి.



మేడ్చల్ మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన వివిధ రూపాల మట్టి ప్రమిదలు



వెరైటీ డిజైన్లలో..

మట్టితో తయారైన అందమైన ప్రమిదలు వెరైటీ డిజైన్లలో లభిస్తున్నాయి. ఫైబర్, మట్టితో పాటు వివిధ రకాల లోహాలతో తయారైన ప్రమిదలు మార్కెట్‌లోకి వచ్చాయి. నీటిలో తేలియాడే ప్రమిదలు, నీటితో వెలిగే ప్రమిదలను వ్యాపారులు ఇతర ప్రాంతాలను నుంచి దిగుమతి చేసుకుని అమ్మకాలు జరుపుతుండడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మట్టితో తయారు చేసిన ప్రమిదలు డజన్ రూ.30 నుంచి 60 వరకు విక్రయిస్తుండగా వైరైటీ డిజన్లకు రూ.50 నుంచి 500 వరకు అమ్ముతున్నారు. మట్టితో తయారు చేసిన దొంతులు, అమ్మవారి ప్రతిమలకు సైతం మంచి గిరాకీ ఉంది. దొంతులు రెండింటికి రూ.100 నుంచి 300 వరకు పలుకుతుండగా అమ్మవారి ప్రతిమలు డిజైన్లను బట్టి వందల్లో పలుకుతున్నాయి.

కాంతులతో ఇంటిని అలంకరిస్తాం..



దీపావళి పండుగ ప్రత్యేకమైంది. ఇంట్లో దేవుడి గదిలో బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకోవడంతో పాటు వాటి మధ్య లక్ష్మీదేవి అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తాం. ఇంటి చుట్టూ లోపల, బయట దీపాలను వెలిగించి అలంకరిస్తాం.
– ప్రవళిక, గృహిణి, పూడూర్

అమ్మకాలు పెరిగాయి..



ఈ ఏడాది దీపావళి, కార్తీక మాసం సందర్భంగా ప్రమిదలు, దొంతులు తయారు చేశాం. గతేడాదితో పోలిస్తే ఈ సారి అమ్మకాలు బాగా జరుగుతున్నాయి. ప్రతీ ఏడాది మార్కెట్‌లోకి వెరైటీ డిజైన్లతో ప్రమిదలు వస్తుండడంతో కుమ్మరులు తయారు చేసే ప్రమిదల అమ్మకాలు తగ్గుతున్నాయి. ప్రజలను ఆకర్షించేలా ప్రమిదలు తయారుచేసి విక్రయాలు సాగిస్తున్నాం.
– అరవింద్, మేడ్చల్ వ్యాపారి

అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్లు చేయవద్దు

మేడ్చల్: పట్టణంలోని సర్వే నెంబర్ 145లో రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్లు చేయవద్దని తహసీల్దార్ శైలజ మేడ్చల్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. 145 సర్వే నెంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉన్నందున కొంత మంది అన్యాక్రాంతాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ సర్వే నెంబర్‌లో రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బోర్డుల తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు

కిష్టాపూర్ రోడ్డులో సర్వే నెంబర్ 145లో వేసిన సీసీ రోడ్లను తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేస్తే వాటిని తొలగించారని, తొలగించిన వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌కు లేఖ రాశారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు



కీసర: బీజేపీ బలోపేతానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు నల్లవెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కీసరలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, యువత బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, అన్నోజిగూడ మల్లారెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌రే ఫిలింల కోసం ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

మేడ్చల్: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు ఎక్స్‌రే తీయడానికి ఉపయోగపడు ఫిలింల కోసం గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందజేశారు. ఆసుపత్రిలో పురాతన మోడల్ ఎక్స్‌రే మిషన్ ఉండటం, ఫిలింల సరఫరా లేకపోవడంతో మిషన్ నిరుపయోగంగా మారింది. శ్రీనివాస్ తన పుట్టిన రోజు సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేయడానికి వెళ్లగా డాక్టర్లు విషయాన్ని వెల్లడించడంతో తోటి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఫిలింల కోసం కావాల్సిన ఆర్థిక సహాయంను అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, మార్కెట్ కమిటీ డైరక్టర్ రాజు, నాయకులు రంజిత్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

- పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు
- కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి



బర్ల కుమార్ (ఫైల్ ఫొటో)

ఘట్‌కేసర్: అనారోగ్యం కారణంగా ఓ యువకుడు ఘట్‌కేసర్ పట్టణంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ పురుశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బర్ల కుమార్ (32) గత కొన్ని రోజులుగా ఉద్యోగం లేక ఇంటి దగ్గర ఉంటున్నాడు. కొంత కాలంగా అతడు లివర్ సమస్యతో బాధపడుతుండడంతో పాటు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని చిన్న చెరువు వద్దకు చేరుకున్నాడు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. దీంతో కాలిన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలు సేకరించారు. అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్సీ,ఎస్టీ ,బీసీల అభ్యున్నతి కోసమే ఇంటింటి కుటుంబ సర్వే



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రధాన ఉద్దేశం వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమేనని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శేఖర్‌తో కలిసి సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఓ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ఎలా నిర్వహించాలని, డేటాను ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలనే విషయాల పై వివరంగా అదనపు కలెక్టరు గుప్తా సూచనలు చేశారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబీలో ప్రతి కుటుంబాన్ని క్రమపద్ధతిలో జాబితా తయారు చేసి ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు. హౌజింగ్ సర్వే పూర్తయిన వెంటనే ప్రతి ఇంటి ముఖ్య ద్వారానికి ప్రక్కన స్టిక్కర్‌ని అతికించాలన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమాని నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచబడతుందన్నారు. ఎన్యూమరేషన్‌లో నింపిన షెడ్యుల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఎన్యుమరేటర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్‌తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్ వైజర్లు ఫీల్డ్‌లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఆ ఇండ్లను సందర్శించి డేటాను మరలా తనిఖీ చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో కిందిస్థాయి ఎన్యూమరేటర్లకు మార్గదర్శకంగా వ్యవహరిస్తూ సహాయం అందించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశం పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆదుకోవాలి



కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కరీంగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ అన్నారు. మంగళవారం కరీంగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సింగిరెడ్డి హరిప్రసాద్ ఉచితంగా టై, బెల్టు, ఐ.డి. కార్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, మధు, పాఠశాల చైర్మన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

అలియాబాద్‌లో గ్రామ సభ



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామ సభ మంగవారం జరిగింది. గ్రామ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కృష్ణకుమార్ ఈసీఐఎల్ టీమ్ ఆధ్వర్యంలో ఆరోగ్యం, వైద్యం, టెక్నాలజీపై ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, కుమార్, సంజీవరెడ్డి, మల్లేష్, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీలో సేవా భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మథర్ థెరిస్సా కాలనీ అధ్యక్షులు బూడిద వెంకటేష్ సమక్షంలో దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటరమణ, నారాయణశర్మ, ప్రవీణ్, హారిక, విజయ, సునీతలక్ష్మీ, రత్నప్రభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం కేసు నమోదైంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌లో అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ సోదా చేయగా అనుమతి లేకుండా, ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా డంప్ చేసిన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రతి పౌరుడు రక్తదానం చేయాలి: ఏసీపీ మహేష్



రక్తదాన శిబిరంలో ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్ సైదయ్య తదితరులు

జవహర్‌నగర్: పోలీసుల అమరవీరుల వారోత్సవాలలో భాగంగా జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో మంగళవారం యాప్రాల్‌లోని డీఎన్ఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కుషాయిగూడ ఏసీపీ మహేష్ హాజరై మాట్లాడుతూ.. పోలీసుల త్యాగాలు ప్రజలు గుర్తించాలన్నారు. ప్రతి పౌరుడు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో పోలీసులు, స్థానిక యువత 40 మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్‌ఐలు రామునాయక్, లక్ష్మయ్య, పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు



జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు, తదితరులు

కీసర: రాంపల్లి జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమైక్యత దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ 8,9 తరగతుల విద్యార్థులు రాంపల్లిలో ఐక్యతా పరుగులో పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజరావ్ మాట్లాడుతూ.. నాడు భారతదేశ ఉప ప్రధానిగా పటేల్ తీసుకున్న నిర్ణయాలు జాతి ఐక్యతకు ఎంతగానో తోడ్పడ్డాయని, నేడు కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలు లేకుండా మనమంతా భారతీయులుగా జీవిస్తున్నామంటే నాడు పటేల్ తీసుకున్నటువంటి సాహసోపేతమైన నిర్ణయాలే కారణమని, ఆ మహనీయుని త్యాగాన్ని గుర్తుచేశారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన రాంపల్లి వాసులు




కీసర: నాగారం మున్సిపల్ నూతన కమిషనర్ భాస్కర్‌రెడ్డిని మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లివాసులు కలిశారు. కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం రాంపల్లి- కరీంగూడ రహదారి విస్తరణలో భాగంగా అధికారులు 100 అడుగుల రహదారిగా విస్తరించేందుకు మార్కింగ్ చేపట్టారన్నారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న తమకు చెందిన గృహసముదాయాలు రోడ్డు విస్తరణలో పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాంపల్లి అంబేద్కర్ విగ్రహం నుంచి రాంపల్లి వాగు వరకు 50 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంజయ్యగౌడ్, మల్లారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన బీజేపీ నేతలు

నాగారం మున్సిపల్ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌రెడ్డిని బీజేపీ నేతలు సూర్యశేఖర్‌రెడ్డి, జూపల్లి నరేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు మంగళవారం కలసి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

మేడ్చల్ పోలీస్‌స్టేషన్ సందర్శించిన డీసీపీ



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో అడ్మినిస్ట్రేషన్ నిర్వహణ తీరు, పెట్రోలింగ్ వాహనాలు, పలు రికార్డులను పరిశీలించిన డీసీపీ అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరుపై స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మన్ననలు పొందేలా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. ప్రజలు సైతం సమాజంలోని అసాంఘీక కార్యకలాపాలు, నిషేధిత పదార్థాల వినియోగంపై వంటి అన్ని విషయాలపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387